నేడు ఢిల్లీకి రేవంత్, భట్టి

- ప్రధాని మోదీని మర్యాదపూర్వకంగా కలవనున్న ముఖ్యమంత్రి
- ఉదయం కాంగ్రెస్ అభిష్టానం పెద్దలతో మంతనాలు
- పదవుల పంపకాలపై అగ్ర నేతలతో చర్చలు
- హైదరాబాద్‌కు క్యూకట్టిన ఆశావహులు
- పీసీసీ మార్పుపైనా చర్చించే అవకాశం

హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మంగళవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. కాంగ్రెస్ అధిష్టానంతోపాటు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తదితరులను కలువనున్నారు. ఉదయం కాంగ్రెస్ పెద్దలను కలిసి మంత్రవర్గ విస్తరణ, ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీ స్థానాలు, నామినేటెడ్ పోస్టుల భర్తీ, రాబోయే పార్లమెంట్ ఎన్నికలపై చర్చించే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. రేవంత్‌రెడ్డి సీఎంగా పదవీబాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీని సాయంత్రం మర్యాదపూర్వకంగా కలువనున్నారు. ఈ మేరకు అపాయింట్‌మెంట్ దొరికినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు తదితర అంశాలపై చర్చిస్తారని సమాచారం.

పీసీసీ మార్పుపై చర్చ?

సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా పీసీసీ మార్పుపై కూడా చర్చ జరిగే అవకాశం ఉన్నదని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల నగారా మోగడానికి ముందే పీసీసీని మార్చాలని అధిష్టానం భావిస్తున్నట్టు తెలిసింది. బీసీ నేతను పీసీసీ చీఫ్‌గా నియమించి పార్లమెంట్ ఎన్నికలకు వెళ్తే కొంత ఉపయోగం ఉంటుందని అధిష్టానం భావిస్తున్నదనే ప్రచారం జరుగుతున్నది. ఒకవేళ సీఎం రేవంత్‌రెడ్డినే పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగిస్తే.. ఒకవైపు పార్టీ బాధ్యతలు, మరోవైపు ప్రభుత్వ బాధ్యతలు నిర్వర్తించడం ఇబ్బందిగా ఉంటుందని, ఆయన మీద పనిభారం పెరుగుతుందని అధిష్టానం భావిస్తున్నట్టు సమాచారం. ఈ కారణంగా ఆయనను పీసీసీ అధ్యక్ష బాధ్యతల నుంచి రిలీవ్ చేసి, పూర్తి స్థాయిలో పాలనపై దృష్టి పెట్టేలా ప్రోత్సహించాలనేది అధిష్టానం ఆలోచనగా చెప్తున్నారు. పీసీసీ మార్పుతో రెండు రకాల ప్రయోజనాలు పొందాలన్నది పార్టీ వ్యూహంగా కనిపిస్తున్నది.

ఆశావహుల ప్రయత్నాలు ముమ్మరం

ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన నేపథ్యంలో పదవులను ఆశిస్తున్నవారిలో ఆశలు చిగురించాయి. ప్రస్తుతం క్యాబినెట్‌లో ఆరు మంత్రి పదవులు, ఆరు ఎమ్మెల్సీలు, 54 నామినేటెడ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి అధిష్టానం పెద్దలను కలిసిన తరువాత ఆయా పదవుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ వచ్చే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో పదవుల పంపకాలపై సానుకూల నిర్ణయం వెలువడుతుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన ఖరారు కాగానే ఆయా జిల్లాల్లోని నేతలు హైదరాబాద్‌కు క్యూ కట్టినట్టు తెలిసింది. తమకు తెలిసిన మంత్రులు, కీలక నేతలతో ఒకమాట చెప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

బిగ్‌బాస్ నిర్వాహకులకు నోటీసులు

బంజారాహిల్స్, డిసెంబర్ 25: అన్నపూర్ణ స్టూడియోస్ వద్ద ఈ నెల 17న హింసాత్మక ఘటనపై బిగ్‌బాస్ షో నిర్వహిస్తున్న 'ఎండల్‌మోల్ షైన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్'కు సోమవారం జూబ్లీహిల్స్ పోలీసులు నోటీసులు అందజేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను అందించాలని పేర్కొన్నారు. కాగా, ఈ ఘటనపై తాజాగా మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేయడం, నిర్వాహకులకు నోటీసులు ఇవ్వడంతో కేసు మరిన్ని మలుపులు తిరిగే అవకాశం కనిపిస్తున్నది.

శరణార్థి శిబిరంపై దాడి.. 70 మంది పాలస్తీనియన్లు మృతి

గాజా, డిసెంబర్ 25: సెంట్రల్ గాజాలోని మఘూజి శరణార్థుల శిబిరంపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో దాదాపు 70 మంది పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో ఎక్కువ మంది మహిళలు, చిన్నారులు ఉన్నారు. దాడి తీవ్రత నేపథ్యంలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

ప్రధానిపై అభ్యంతరకర పోస్ట్.. నోయిడా వ్యక్తి అరెస్ట్

లక్నో, డిసెంబర్ 25: ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, సీఎం యోగికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో అభ్యంతరకర వీడియోను పోస్ట్ చేసిన వ్యక్తిని యూపీలోని నోయిడా పోలీసులు అరెస్టు చేశారు. నోయిడాలోని సెక్టార్-51కు చెందిన రామ్‌పాట్ యాదవ్‌ను గౌతమ్‌బుద్ధ నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిపై వివిధ సెక్షన్ల కేసు నమోదైంది.

కాలీఫ్లవర్ తెంపిందని స్తంభానికి కట్టేసి..

- కన్నతల్లిని చితకబాదిన కుమారుడు
- ఒడిశాలో దారుణ ఘటన

భువనేశ్వర్: ఒడిశాలోని కియోంజర్ జిల్లా, సరసపసి గ్రామంలో దారుణం జరిగింది. 70 ఏండ్ల వృద్ధురాలిపై కుమారుడు కర్కశంగా వ్యవహరించాడు. స్తంభానికి కట్టేసి చితకబాదాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఆయన పొలంలోని కాలీఫ్లవర్‌ను తెంపడంతో ఇద్దరూ వాగ్వాదానికి దిగారు. ఇరువురి మధ్య మాటలు పెరగడంతో కుమారుడు ఆమెను విద్యుత్తు స్తంభానికి కట్టేసి, చితకబాదాడు. ఈ దారుణాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించిన స్థానికులను బెదిరించాడు. కాసేపటి తర్వాత స్థానికులు ఆమెను దవాఖానకు తరలించి, చికిత్స చేయించారు. ఆ తర్వాత పోలీసులకు సమాచారం అందించడంతో వారు కేసు నమోదు చేశారు.

89 దేశాల్లోని జైళ్లలో భారతీయులు

- కారాగారవాసంలో 9,521 మంది

హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): గాలిదూరని చోటు లేనట్టే.. ప్రపంచంలో భారతీయులు లేని దేశం ఉండదు అనడం అతిశయోక్తి కాదు. చిన్నా.. పెద్దా తేడా లేకుండా దాదాపు అన్ని దేశాల్లో మనవాళ్లు కాళ్లుమోపారు. ప్రపంచంలో 193 దేశాలు ఉన్నట్టు ఐక్యరాజ్య సమితి చెప్తున్నది. ఉద్యోగం కోసమో, ఉపాధి కోసమో, వ్యాపారం కోసమో.. ఇలా కారణం ఏదైనా మనవాళ్లు దాదాపు అన్ని దేశాల్లో తిష్టవేశారు. ఇదొక్కటే మనం సాధించిన ఘనత అని సంబురపడితే మీరు పప్పులో కాలేసినట్టే. కొత్తకొత్త దేశాలకు వెళ్లడమే కాదు.. అక్కడ నేరాలు చేసి జైళ్లకు వెళ్లడంలోనూ మనవాళ్లు ఘనులేనట. ఎందుకంటే.. ప్రపంచవ్యాప్తంగా 89 దేశాల్లో మన భారతీయులు కారాగారవాసం చేస్తున్నారట. ఆయా జైళ్లలో మొత్తం 9,521 మంది భారతీయులు మగ్గుతున్నారట. స్వయంగా కేంద్ర ప్రభుత్వమే ఈ వివరాలను తాజాగా వెల్లడించింది. ఇన్నాళ్లూ మనం అరబ్ దేశాలకు వలస వెళ్లినవాళ్లో, అక్రమంగానో, అనుకోకుండానో పాకిస్థాన్, శ్రీలంకకు చేరినవాళ్లో, అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లోనూ మన భారతీయులు ఊచలు లెక్కపెడుతుండొచ్చు అని భావిస్తుంటాం. కానీ, కేంద్రం చెప్పిన లెక్కల ప్రకారం మనవాళ్లు నేరం చేయడానికి చిన్నాపెద్దా.. పేద, ధనిక.. దగ్గర, దూరం అనే తేడాలేమీ చూపించలేదని స్పష్టమవుతున్నది.

సౌదీఅరేబియాలో అత్యధికం

కేంద్రం నివేదిక ప్రకారం ఎక్కువగా అరబ్ దేశాల జైళ్లలోనే భారతీయులు చిక్కుకున్నారు. సౌదీఅరేబియా జైలులో 2,200 మంది ఉన్నారు. దుబాయ్ (యూఏఈ) జైలులో 2,143 మంది మగ్గుతున్నారు. 1227 మంది భారతీయ ఖైదీలతో నేపాల్ మూడో స్థానంలో ఉన్నది. పాకిస్థాన్ జైళ్లలో 308, చైనాలో 180 మంది ఉన్నారు. ఎడారి దేశాలు ఖతార్ (752), కువైట్ (410), బహ్రెయిన్ (310), ఒమన్ (135) టాప్‌లోనే ఉన్నాయి.టోగో, మొజాంబిక్, గ్వాటెమాలా, అంగోలా, రువాండా, మాల్టా, ఐవరీకోస్ట్, సైప్రస్ వంటి పెద్దగా గుర్తింపు లేని దేశాల్లోని జైళ్లలో కూడా మనోళ్లు ఉన్నారు. అమెరికా, ఇంగ్లాండ్, ఇటలీ, జర్మనీ, జపాన్, స్విట్జర్లాండ్ వంటి ధనిక దేశాల్లోనే కాదు.. జింబాబ్వే, నైజీరియా, టాంజానియా వంటి పేద దేశాల్లో జైలు కూడు తింటున్నారు.

క్యూఆర్ కోడ్‌తో డబ్బులు విత్ డ్రా

- దేశంలో తొలిసారిగా సిద్దిపేట మాడల్ బస్టాండ్‌లో ఏర్పాటు
- మిషన్‌ను ప్రారంభించిన మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట మాడల్ బస్టాండ్‌లో క్యూఆర్ కోడ్‌తో డబ్బులు విత్ డ్రా చేసే మిషన్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, డిసెంబర్ 25: డిజిటల్ మనీ ట్రాన్జాక్షన్‌లో భాగంగా ప్రజలు క్యూఆర్ కోడ్ స్కాన్‌తో క్షణాల్లో డబ్బులు విత్ డ్రా చేసుకునే సౌకర్యాన్ని దేశంలోనే తొలిసారి సిద్దిపేటలో అందుబాటులోకి తెచ్చారు. క్యూటీఎం ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సిద్దిపేట మాడల్ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌తో డబ్బులు విత్ డ్రా చేసుకొని మిషన్‌ను సోమవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే క్షణాల్లో నగదు విత్ డ్రా చేసుకునే సౌకర్యం ఏర్పాటు చేయడంపై సంస్థ ప్రతినిధులను అభినందించారు. మినీ ఏటీఎం మాదిరిగానే క్యూఆర్ మినీ ఏటీఎం పనిచేస్తుందని తెలిపారు. ఆధార్ కార్డు, వేలిముద్ర, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, క్యూఆర్ కోడ్ స్కానింగ్, యూపీఐ సర్వీసెస్ ద్వారా నగదు విత్ డ్రా చేసుకునే సౌకర్యం ఉంటుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో టీహబ్ ద్వారా రూపొందించిన ఈ టెక్నాలజీని సిద్దిపేటలో తొలిసారి ప్రారంభించినట్టు పేర్కొన్నారు. క్యూటీఎం ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇది పనిచేస్తుందని హరీశ్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ చైర్మన్ చికోటి నరేశ్‌గుప్తా, కో చైర్మన్ షేక్ షమీం, తెలంగాణ స్టేట్ డీలర్ రమేశ్, సిద్దిపేట జిల్లా డీలర్ జనార్దన్, ఆయా జిల్లాల డీలర్లు పాల్గొన్నారు.

ఉద్యోగ స్ఫూర్తిని కొనసాగించండి

- కాంగ్రెస్ ప్రభుత్వానికి బీ వినోద్‌కుమార్ సూచన

హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఉద్యోగ నైపుణ్యం కలిగిన రాష్ట్రంగా అగ్రస్థానంలో నిలిచిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలని మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్ సూచించారు. గరిష్ఠ ఉపాధి సామర్థ్యం ఉన్న తొలి రాష్ట్రంగా తెలంగాణ 85.45% నిలిచిందని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేసీఆర్ సారథ్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఇతర రాష్ట్రాల యువత తెలంగాణలోనే ఉద్యోగాలు పొందుతున్నారని చెప్పారు. డిగ్రీ, ఎంబీఏ, బీటెక్, ఇతర నైపుణ్యం కలిగిన యువత ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు అందివచ్చిన ప్రైవేటు ఉద్యోగాలను సైతం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ ఏర్పాటయ్యాక కేసీఆర్ విదేశీ కంపెనీలను సైతం హైదరాబాద్ ప్రాంతంలోనే ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగాలు కల్పించారని గుర్తుచేశారు. కేసీఆర్ సర్కారు టీహబ్, టీవర్క్స్‌ను ఏర్పాటు చేసిందని, తద్వారా యువ ఇంజినీర్లను ఆంత్రప్రెన్యూయర్లుగా తయారు చేసిందని గుర్తు చేశారు. హైదరాబాద్‌తోపాటు జిల్లాల్లోనూ ఐటీ టవర్లు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. టీహబ్, టీవర్క్స్ మధ్య సమన్వయం, అనేక హ్యాకథాన్లు, ఇన్నోవేషన్, ఛాలెంజ్‌ను ప్రభుత్వ సహకారంతో నిర్వహించినట్టు స్వయంగా స్కిల్ ఇండియా నివేదికలో పేర్కొన్నదని తెలిపారు.

'ఆరు గ్యారెంటీలు' దరఖాస్తులకే పరిమితమా?

- ముస్లిం దేశాలే నిషేధించిన తబ్లిగీ జమాతేకు నిధులిస్తరా?
- కాంగ్రెస్ సర్కారుపై ఎంపీ బండి ప్రశ్నల వర్షం

విద్యానగర్ (కరీంనగర్), డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఆరు గ్యారెంటీల అమలుకు కాంగ్రెస్ సర్కారు దరఖాస్తులను ఆహ్వానించడాన్ని స్వాగతిస్తున్నామని, కేవలం పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని దరఖాస్తులకే పరిమితం కావద్దని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రజలకు అనేక సందేహాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్నదని చెప్పారు. రాష్ట్రంలో రూ.6.75 లక్షల కోట్ల అప్పులున్నాయని చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ అప్పులు ఎలా తీరుస్తది? ఆరు గ్యారెంటీలను ఎలా అమలు చేస్తది? అనేది వెల్లడించాలని డిమాండ్ చేశారు. దేశాన్ని అర్ధశతాబ్దం పాలించిన కాంగ్రెస్ పార్టీ లబ్ధిదారుల కోసం రూపాయి విడుదల చేస్తే కేవలం 15 పైసలు మాత్రమే అందేవని, మిగతావి దళారుల చేతికి వెళ్లేవని రాజీవ్‌గాంధీ స్వయంగా చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో అవినీతికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. కరీంనగర్‌లో సోమవారం నిర్వహించిన మాజీ ప్రధాని వాజపేయి జయంతి ఉత్సవంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంజయ్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ముస్లిం దేశాలే నిషేధించిన తబ్లిగీ జమాతే సంస్థ సమావేశాలకు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. దీంతో ముస్లిం పేద సమాజానికి ఏమైనా ఉపయోగం ఉన్నదా? అని ప్రశ్నించారు. ఉగ్రవాదులను తయారు చేయడం, బలవంతంగా మతమార్పిళ్లకు పాల్పడే ఈ సంస్థకు నిధులు ఇవ్వడం వెనుక ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

పునాదిని పరిశీలించాల్సిందే

- మేడిగడ్డపై పూర్తిస్థాయి ఇన్వెస్టిగేషన్ తప్పనిసరి
- లేకపోతే కుంగుబాటుకు అసలు కారణాలు తేలవు
- ఇసుక కోతే కారణమని గతంలోనే ప్రాథమిక అంచనా
- వాస్తవాలు తెలిస్తేనే పునరుద్ధరణ చర్యలకు అవకాశం
- తొలుత 7వ బ్లాక్, ఆ తర్వాత అన్ని బ్లాకుల పరిశీలన
- ఆ బాధ్యతలు ప్రైవేట్ కంపెనీకి అప్పగించాలని ఇప్పటికే నిర్ణయం
- 29న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు ప్రాజెక్టు సందర్శన

హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ (లక్ష్మీబరాజ్) ఎలా కుంగిపోయింది? అందుకు కారణం ఏమిటి? సాంకేతిక తప్పిదమా? నిర్మాణ వైఫల్యమా? ఎక్కడ లోపం జరిగింది? ఏం జరిగింది? ఎంత మేరకు నష్టం వాటిల్లింది? ఇత్యాది ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే ఫీల్డ్ ఇన్వేస్టిగేషన్ చేయడమే మార్గం. బరాజ్ పునాదిని తవ్వి పరిశీలించాల్సిందే. బరాజ్ నిర్మాణాలను తనిఖీ చేయాల్సిందే. ఆ తర్వాత సాంకేతిక అంశాలతో సరిపోల్చి చూసి ఎక్కడ లోపం జరిగిందో నిర్ధారించాల్సి ఉంటుంది. ఆ తర్వాతే చేపట్టాల్సిన పునరుద్ధరణ చర్యలను నిర్ణయించాల్సి ఉంటుంది. సూటిగా చెప్పాలంటే చికిత్స ప్రారంభానికి చేసే రోగనిర్ధారణ పరీక్ష ఎంత ముఖ్యమో మేడిగడ్డ బరాజ్ ఫీల్డ్ ఇన్వేస్టిగేషన్ కూడా ఇప్పుడు అంతే ముఖ్యం. అది పూర్తయితే తప్ప కారణాలపై అంచనాకు రాలేమని ఇంజినీరింగ్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

పూర్తిస్థాయి ఇన్వెస్టిగేషన్ తప్పనిసరి

7వ బ్లాక్‌లోని పిల్లర్ల కింద అర్గతంగా కొనసాగిన నీటిప్రవాహం వల్ల ఇసుక, మట్టి కోతకు గురవడం వల్లనే మేడిగడ్డ బరాజ్ కుంగినట్టు ఇంజినీరింగ్ నిపుణులు ప్రాథమికంగా అంచనా వేశారు. దీనితోపాటు ఆ ప్రాజెక్టును సందర్శించిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందంలోని అధికారులు పలు అనుమానాలను వ్యక్తం చేశారు. బరాజ్‌ను పునాది వరకు తవ్వి పరీక్షించకపోతే కుంగుబాటుకు వాస్తవ కారణాలు తెలియవని వెల్లడించారు. బరాజ్‌లోని సంక్లిష్ట నిర్మాణాల్లో సీపేజ్ వ్యవస్థ అత్యంత కీలకమైనది. దీనిలో భాగంగా చేపట్టిన సీకెంట్ లేదా షీట్ పైల్స్ నిర్మాణాలు, బరాజ్ ఫౌండేషన్, బేరింగ్ కెపాసిటీతోపాటు బరాజ్ ఎగువ, దిగువన చేపట్టిన నిర్మాణాలు కూడా అనేక సంక్లిష్టతలు, సవాళ్లతో కూడినవే. క్షేత్రస్థాయి భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా డిజైన్లలో ఎప్పటికప్పుడు మార్పులు చేసుకుంటూ ఈ నిర్మాణాలను కొనసాగించాల్సి ఉంటుంది. దీనికి ముందస్తుగా అనేక పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఇసుక పొరల కదలిక వల్ల 7వ బ్లాక్‌లోని పిల్లర్లు కుంగుబాటుకు గురైనట్టు ప్రాథమికంగా అంచనా వేసినా వేసినప్పటికీ.. బరాజ్‌లోని మిగిలిన బ్లాకుల పిల్లర్ల వద్ద లేని సమస్య కేవలం 7వ బ్లాక్‌లోనే ఎందుకు వచ్చిందన్న విషయాన్ని తేల్చాల్సి ఉన్నది. అందుకోసం 7వ బ్లాక్‌ను పునాది వరకు తవ్వి అక్కడ చేపట్టిన నిర్మాణాలను, సీపేజీ వ్యవస్థలను పరిశీలించడం ద్వారా డిజైన్లకు అనుగుణంగా నిర్మాణం జరిగిందో లేదో తెలుసుకోవాల్సి ఉన్నది. ఈ పరిశీలనలో తేలిన అంశాలన్నింటినీ క్రోడీకరించాకే బరాజ్ కుంగుబాటుకు వాస్తవ కారణాలు వెల్లడవుతాయని ఇంజినీరింగ్ నిపుణులు చెప్తున్నారు.

ఇన్వేస్టిగేషన్ కోసం మొదలైన పనులు

బరాజ్ కుంగుబాటుకు కారణాలను తెలుసుకోవడంలో భాగంగా ప్రస్తుతం ఫౌండేషన్ ఇన్వేస్టిగేషన్ చేపట్టేందుకు నిర్మాణ ఏజెన్సీ ఎల్‌అండ్‌టీ చర్యలు చేపట్టింది. ఈ ఇన్వేస్టిగేషన్ చేపట్టాలంటే బరాజ్ కుంగుబాటుకు గురైన ప్రాంతంలో నీరు లేకుండా చేయాలి. అందుకోసం ఎగువన కాఫర్ డ్యామ్‌ను నిర్మించాల్సి ఉండటంతో దాదాపు రూ.55 కోట్లతో అంచనాలను రూపొందించి ఇప్పటికే ఆ పనులను చేపట్టింది. ప్రస్తుతం అందుకు కావాల్సిన మెటీరియల్‌ను తరలించే వాహనాల రాకపోకలకు అనువుగా రోడ్డు నిర్మాణం చేపట్టింది. ఈ నెల 27 నుంచి కాఫర్ డ్యామ్ నిర్మాణ పనులను ప్రారంభించాలని నిర్ణయించినట్టు సమాచారం. మొత్తం 1,672 మీటర్ల పొడవైన మేడిగడ్డ బరాజ్‌లో 8 బ్లాకులు, ఒక్కో బ్లాక్‌లో 11 పిల్లర్లు ఉన్నాయి. దీంతో కాఫర్ డ్యామ్‌ను 4 లేదా 5వ బ్లాక్ వరకు నిర్మించాలని ప్రాథమికంగా నిర్ధారించినట్టు తెలుస్తున్నది. కాఫర్ డ్యామ్ నిర్మాణం తర్వాత డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానల్ బరాజ్ కుంగుబాటు కారణాలను అన్వేషించనున్నది.

29న మంత్రుల పర్యటన

ఇరిగేషన్, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఈ నెల 29 ఉదయం 9 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో వెళ్లి మేడిగడ్డ బరాజ్‌ను సందర్శించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేయనున్నారు. ప్రాణహిత, కాళేశ్వరం ప్రాజెక్టుల వివరాలు, కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయం, దాని వల్ల జరిగిన లాభ, నష్టాలు, కొత్త ఆయకట్టు, స్థిరీకరణ ఆయకట్టు వివరాలు, ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన విద్యుత్తు, మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బరాజ్‌ల సమస్యలు, వాటి పరిష్కారాలు తదితర అంశాలపై సమీక్షించనున్నారు. అనంతరం అన్నారం బరాజ్‌ను పరిశీలించనున్నారు. ఈ పర్యటనకు సంబంధించి నిర్మాణ సంస్థలు, సబ్-కాంట్రాక్టర్లతో పాటు నిర్మాణంలో సంబంధం ఉన్న వారందరికీ సమాచారం ఇవ్వాలని, అందరూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే రాష్ట్ర సాగునీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానల్ ఆధ్వర్యంలోనే

ప్రస్తుతం మేడిగడ్డ బరాజ్‌లోని పిల్లర్ కుంగుబాటునకు గల కారణాలపై డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానల్ ఇన్వేస్టిగేషన్‌ను కొనసాగించనుంది. డ్యామ్ సేఫ్టీ యాక్ట్-2021 ప్రకారం.. ప్రతి రాష్ట్రం స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్స్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. తద్వారా ఆయా రాష్ట్రాల్లోని డ్యామ్‌లను సమగ్రంగా ఆడిట్ చేయడంతోపాటు ఏదైనా డ్యామ్‌కు నష్టం వాటిల్లిప్పుడు క్షేత్రస్థాయి పరిశీలనతో కారణాలను నిగ్గుతేల్చి తదుపరి చేపట్టాల్సిన పునరుద్ధరణ చర్యలపై సిఫారసులు చేసేందుకు ఇంజినీర్లతోపాటు హైడ్రాలజీ, జియాలజీ, డిజైన్ రంగాల్లోని నిపుణులతో డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానల్స్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం గతంలోనే ఏబీ పాండ్యా నేతృత్వంలో 8 మంది నిపుణులతో డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానల్‌ను ఏర్పాటు చేసింది. ఇప్పటికే ఈ ప్యానల్ మేడిగడ్డ బరాజ్‌ను సందర్శించి ప్రాథమికంగా పలు అంశాలను గుర్తించింది. ప్రస్తుతం ఆ బృందమే బరాజ్ కుంగుబాటు కారణాలపై పూర్తిస్థాయి ఇన్వేస్టిగేషన్ కొనసాగించనున్నది. వాస్తవ కారణాలను నివేదించడంతోపాటు, తదుపరి చేపట్టాల్సిన పునరుద్ధరణ చర్యలను కూడా ఈ బృందమే సిఫారసు చేయనున్నది.